ఈనాడు
epaper.eenadu.net



పరిశోధకులు మహ్మద్ జఫురుల్లా, జి.ఆదిత్యకుమార్, ఆచార్య అమితాబ్ ఛటోపాధ్యాయ్, పర్ణత్ సర్కార్

కణాల్లో కుంగుబాటు కారకాల సంచారం గుర్తింపు

- **సీసీఎంబీ శాస్త్రవేత్తల వెల్లడి**

ఈనాడు, హైదరాబాద్: మనుషుల్లో కుంగుబాటుకు కారణమయ్యే సెరటోనిన్ గ్రాహకాల సంచారాన్ని కణాల్లో గుర్తించామని సీసీఎంబీ శాస్త్రవేత్తలు తెలిపారు. కుంగుబాటు నుంచి బయటపడేసే ఔషధాలు పనిచేసే విధానాన్ని తెలుసుకునేందుకు ఈ పరిశోధన దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దేశంలో 18 ఏళ్ల నిండిన జనాభాలో 5% కుంగుబాటుకు గురవుతున్నారని 2015-16 సంవత్సరపు మానసిక ఆరోగ్య సర్వే వెల్లడించిన నేపథ్యంలో.. ఈ పరిశోధన ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. ప్రస్తుతం 40% ఔషధాల తయారీకి జి.ప్రొటీన్ గ్రాహకాలు(జీపీసీఆర్ఎస్) లక్ష్యంగా పరిశోధనలు సాగుతున్నాయి. వీటిలో ఉండే సన్నటి కణత్వచం కణాలను వేరుచేస్తూ ఉంటుంది. ఈ గ్రాహకాలు కణాల వెలుపల నుంచి లోనికి సమాచారాన్ని అందిస్తాయి. సమాచార కేంద్రాలుగా పనిచేస్తున్న కారణంగానే ఔషధాల తయారీకి ఇవి లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ గ్రాహకాలు ఏ విధంగా కణంలోకి ప్రవేశిస్తాయి? అనే విషయం ఇప్పటివరకు అస్పష్టంగానే ఉంది. ఈ విషయాలపై సీసీఎంబీలోని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అమితాబ్ ఛటోపాధ్యాయ్ నేతృత్వంలోని పరిశోధన బృందం చేసిన పరిశోధనలు ప్రతిష్ఠాత్మక బయోకెమెస్ట్రీలో తాజాగా ప్రచురితమయ్యాయి. కణాల్లో ప్రవేశించేందు(ఎండోసైటోసిస్)కు సెరటోనిన్ గ్రాహకం ముఖ్యమైందని వీరు గుర్తించారు. ఈ సెరటోనిన్ గ్రాహకం నాడీ, మానసిక రుగ్మతలైన ఆందోళన, కుంగుబాటు నివారణ మందులకు లక్ష్యంగా పనిచేస్తుంది. సెరోటోనిన్ గ్రాహకాలు కణత్వచంలోని క్షతరీన్ పూతపూసిన రంధ్రాల్లోకి ప్రత్యేక మార్గం ద్వారా ప్రవేశిస్తాయని పరిశోధకులు తేల్చారు. కణంలోని సెరటోనిన్ గ్రాహకాలు తిరిగే మార్గాన్ని, తిరిగి కణత్వచం చేరే విధానాన్ని గుర్తించామని పరిశోధక విద్యార్థి జి.ఆదిత్యకుమార్ తెలిపారు. భవిష్యత్తులో వేర్వేరు కణాల్లో ఎండోసైటోసిస్ జరిగే విధానాన్ని గుర్తించేందుకు పరిశోధన దోహదం చేస్తుందని డాక్టర్ అమితాబ్ ఛటోపాధ్యాయ్ అన్నారు.

Date : 05/06/2019 EditionName : GREATER HYDERABAD PageNo : Page 11